# ప్రభువునకు నేను ఏమి చేయాలి?

## డేవిడ్ రోపర్

ఆస్ట్రేలియాలోని సిడ్నీ పట్టణం యొక్క కేంద్ర స్థానంలో ఓడరేవుకు సమీపంగా ఉన్న ఎత్తయిన భవనాలలో – ఆంగ్లేయులు వలసపోయి జరిగించిన తొలి మత సంబంధమైన కార్యక్రమానికి జ్ఞాపక చిహ్నం ఒకటి కట్టబడింది. అది బహుగా మనస్సుకు హత్తుకు పోయేదైయుంది.

నీ మనస్సులో ఈ దృశ్యాన్ని చిత్రించుకో: జనవరి 26, 1788న యిప్పుడు సిడ్నీ హార్బర్‌గా ఉన్న చోటుకి – ఒక బోటు నిండా వచ్చిన వలసవాసులు – ఎక్కువగా గతంలో నేరస్థులు మరియు బానిసలు – చేరుకున్నారు. ఒక కాలనీ ఏర్పరచుకున్నారు. ఫిబ్రవరి 3న వారు లోపలికి వచ్చారు అక్కడ వారు ఒక భవనాన్ని నిర్మించారు. ఆ ప్రయాణంలో అనేకులు చనిపోయారు. బ్రతికియున్న కొద్ది మందికి ఆస్తిపాస్థులేవీ లేవు. వారి చుట్టు ఉన్నది అరణ్యమే, అక్కడ నివాసులు, తప్పించుకొని పారిపోయే అనాగరికులైన ప్రజలు మాత్రమే.

నియమింపబడిన కాలంలో, రిచర్డ్ జాన్‌సన్ అనే చాప్లిన్ మాట్లాడడానికి నిలబడ్డాడు. ఆ సందర్భానికి తగిన లేఖన భాగం ఏమైయుంటుంది? "నిప్పు రవ్వలు పైకి ఎగురునట్లు నరులు శ్రమానుభవమునకే పుట్టుచున్నారు" అనేది సరిపోతుందా? (యోబు 5:7). కీర్తనలు 13:1 తగిపోయినట్లు కన్పిస్తుంది: "యెహోవా, ఎన్నాళ్లవరకు నన్ను మరచి పోవుదువు? నిత్యము మరచెదవా? నాకెంతకాలము విముఖుడవైయుందువు?" అయితే జాన్‌సన్‌గారు ఈలాటి లేఖన భాగాల్లో దేన్నీ ఎన్నుకోలేదు. అతడు ఏరుకున్న లేఖన భాగం కీర్తనలు 116:12: "యెహోవా నాకు చేసిన ఉపకారములన్నిటికి నేనాయనకేమి చెల్లించుదును?" ఆ జనులకు కొంచెమే ఉంది; అయితే వారు సజీవంగాను స్వతంత్రంగాను ఉన్నారు. భవిష్యత్తు మేలు కలిగేలా కన్పిస్తుంది. తాము చేసిన దానికి వారు కృతజ్ఞత కలిగియున్నారు.

ఎప్పుడో కూడిన ఆరాధనా కూడికనుండి నీ దృష్టి నేటి కూడికవైపు మరల్చు. మనం నేడు స్నేహితులు ప్రేమించేవారి మధ్య ఉన్నాం, క్రీస్తునందు నేడు సోదర సోదరీమణులుగా ఉన్నారు. మనం బానిసలం కాదు, స్వతంత్రులం; మనలో ఎక్కువ మందిమి రాజకీయంగా స్వతంత్రులమైయున్నాం. అయితే క్రైస్తవులందరు ఆత్మ సంబంధంగా స్వతంత్రులైయున్నారు. ప్రభువుచే మనం అత్యధికంగా దీవించబడినవారమై ఉన్నాం. అందునుబట్టి, "ప్రభువు మన పక్షంగా చేసిన ఉపకారములకు మనమేమి చెల్లించుదాం?" అని అడగడం రెండంతలు తగినదిగా ఉంటుంది.

## మనయెడల తన ఉపకారములన్నీ

"మనయెడల ఆయన చేసిన ఉపకారములన్నిటిని" మనం గుర్తించనారంభిస్తాం. మాటి మాటికి మనం ఆయన ఆశీర్వాదములను లెక్కించవలసియుంటుంది.

**ఆత్మసంబంధమైన ఆయన ఉపకారములు**

అన్నిటికంటే అతి ప్రాముఖ్యమైనవి – ఆత్మసంబంధమైన ఆయన ఉపకారములు. "మన ప్రభువైన యేసు క్రీస్తుయొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోకవిషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకను గ్రహించెను" (ఎఫెసీ. 1:3).

ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములలో అతి శ్రేష్ఠమైనది తన కుమారుని మన కొరకు ప్రసాదించినదే. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). నాకు ముగ్గురు కుమార్తె లున్నారు, అయితే వారిలో ఒక్కరిని కూడా మానవ జాతికొరకు నేను యివ్వలేను. దేవునికి ఒకే కుమారుడున్నాడు, అయితే ఆయన తన ఏకైక కుమారుని మనకొరకు అనుగ్రహించాడు. "చెప్ప శక్యము కాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము" (2 కొరింథీ. 9:15).

మరియొక ముఖ్యమైన వరము – బైబిలు. బైబిలు దేవుని సంపూర్ణమైన కడసారి ప్రత్యక్షతయై ఉంది. "... ఆయన దైవశక్తి, జీవమునకును భక్తికిని కావలసినవాటినన్నిటిని మనకు దయచేసి" యున్నాడు (2 పేతురు 1:3). బైబిలు మనలను ప్రతి సత్కార్యమునకు పూర్ణంగా సిద్ధపరచియుంచుతుంది (2 తిమోతి 3:17). మనం ఆరాధించే జీవులం. ఎలా ఆరాధించాలో బైబిలు మనకు బోధిస్తుంది (యోహాను 4:24). మనం పాపం చేసిన మానవ మాత్రులం, మనం ఎలా రక్షింపబడాలో బైబిలు తెలుపుతోంది (మార్కు 16:15, 16). మనం బాధను అనుభవించే ప్రాణులం, బైబిలు మనకు గొప్ప వైద్యుని బయలుపరచుతుంది (మార్కు 9:12). మనం అధైర్యపడినప్పుడు ధైర్యపరచే వర్తమానాన్ని బైబిలు అందిస్తుంది. మనం బలహీనులంగా ఉన్నప్పుడు, అది మనకు బలాన్ని చేకూర్చు తుంది. మనం సంతోషంగా ఉన్నప్పుడు, మన ఆనందానికి సహకారంనిస్తుంది. మనం నిరాశ చెందినప్పుడు, అది నిరీక్షణను మనకు ప్రసాదిస్తుంది. మనం మరణించు తున్నప్పుడు, దేవుని కృప ద్వారా అది మనకు జీవాన్ని వాగ్దానం చేస్తుంది.

తరువాత రక్షణ అనే బహుమానం ఉంది. ఆ బహుమానం ఎంతో అత్యధిక మయ్యింది. "పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము" (రోమా 6:23).

రక్షణ అనే ఈవితో సంఘమనే వరము జత చేయబడింది (ఎఫెసీ. 3:10, 11). రక్తముతో కొనబడిన (అపో. 20:28), ఆత్మతో నింపబడిన (ఎఫెసీ. 2:22), మహిమకు వెళ్లనైయున్న సంఘమది (1 కొరింథీ. 15:23-26). దేవుడు తండ్రిగానున్న ఆత్మ

సంబంధమైన కుటుంబమే సంఘం (1 తిమోతి 3:15). దానిపై క్రీస్తు రాజైయుండే రాజ్యమది (మత్తయి 16:18, 19). మనం శ్రమించే ద్రాక్షా తోట అదే (మత్తయి 20:1). మనం ప్రభువు పక్షంగా పోరాడే దేవుని ఆత్మ సంబంధమైన సైన్యమది (1 తిమోతి 6:12). మనం ఆయనను ఆరాధించే దేవుని ఆలయం అదే (ఎఫెసీ. 2:21). అది, "క్షేమకరమైన ఓడ"[1] "మన ఆశ్రయ పురము"[2] అక్కడ మనం కాపుదలను రక్షణను పొందుతాం లేక కనుగొంటాం (ఎఫెసీ. 2:16; అపొ. 20:28 చూడు).

దీనంతటితో, ఆయన "అమూల్యములును అత్యధికములునైన వాగ్దానములను" మనకు చేర్చవచ్చు (2 పేతురు 1:4; నొక్కి పలకడం నాది). బైబిల్లో నీకు ప్రీతికరమైన వాగ్దానమేమి? నాకు యిష్టమైన కొన్ని వాగ్దానాలు యిక్కడ యివ్వబడ్డాయి:

> దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పముచొప్పున పిలువబడిన వారికి, మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము (రోమా 8:28).
>
> దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తువలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండును (ఫిలిప్పీ. 4:6, 7).
>
> ... నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా. కాబట్టి – ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు? అని మంచి ధైర్యముతో చెప్పగలవారమై యున్నాము (హెబ్రీ. 13:5, 6).
>
> ఆయన మిమ్మునుగూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి (1 పేతురు 5:7).
>
> అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమైయుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:7).

చిట్టచివరిగా, పరలోకమనే బహుమానం కొరకు మనం ఎదురు చూస్తాం. అద్భుతమైన ఆ స్థలములో దేవుడు తానే మనకు దేవుడైయుండి మనకు తోడైయుండును. "ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు, మొదటి సగతులు గతించి పోయెనని ..." (ప్రకటన 21:4)!

### ఆయన భౌతికమైన ఉపకారములు

దేవుని ఆత్మ సంబంధమైన ఈవులు అద్భుతమైనవి. ఏదియెలాగున్నా, ఆయన భౌతికమైన ఉపకారములు అలక్ష్యం చేయవలసినవి కావు.

ఆయన మనకు కుటుంబాలను ప్రసాదించాడు: మన భార్య పిల్లలు. "గుణవతియైన భార్య దొరుకుట అరుదు అట్టిది ముత్యముకంటె అమూల్యమైనది" (సామె. 31:10). "సుబుద్ధిగల భార్య యెహోవాయొక్క దానము" (సామె. 19:14). "కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము గర్భఫలము ఆయన యిచ్చు బహుమానమే" (కీర్తన. 127:3). క్రైస్తవ గృహము వికసించిన పుష్పమైతే, పరలోకము దాని ఫలము అని ఒకరు అన్నారు.

జీవితము యొక్క అవసరతలను దేవుడు దయచేస్తున్నాడు. మన "అనుదిన ఆహారమును" దేవుడు అనుగ్రహించువాడైయున్నట్టు కొండమీద ప్రసంగంలో ప్రభువు నొక్కి పలికాడు (మత్తయి 6:11). ఆయన ఆకాశ పక్షులకును మనకును దయచేయువాడు (మత్తయి 6:26). "ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" అని ప్రభువు వాగ్దానం చేశాడు (మత్తయి 6:33).[3]

పైగా, దేవుడు మనకు దేహములను, వాటియందు ఆరోగ్యాన్ని ప్రసాదించాడు. "నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి" అని దావీదు పలికాడు (కీర్తన. 139:14).

తదుపరి, దేవుడు అనుగ్రహించిన సమాధానము మరియు స్వాతంత్ర్యం అనేవి ఉన్నాయి. "... మనుష్యులందరికొరకును, రాజుల కొరకును అధికారులందరికొరకును విజ్ఞాపనములును ప్రార్థనలును ... చేయవలెనని హెచ్చరించుచున్నాను. ఇది మంచిదియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమైనదియునై యున్నది" (1 తిమోతి 2:1, 2). సంపూర్ణమైన భక్తియు, మాన్యతయు గలిగి నెమ్మదిగాను, సుఖముగాను బ్రదుకుటకు ఈ పని చేయవలసినదిగా చెప్పబడ్డాం. లోకంలోని అనేక భాగములయందు దేవుని ఆరాధించడానికి కూడివచ్చే అవకాశాలుగల స్వాతంత్ర్యంతో క్రైస్తవులు దీవించబడ్డారు. ఇది గొప్ప భాగ్యమైయుంది.

దేవుడు సౌందర్యాన్ని ప్రసాదించిన సంగతి మరచిపోకూడదు. సూర్య, చంద్ర, నక్షత్రాల రమ్యతతో మనం ఆవరించబడియున్నాం. మంచి రుతువులు, అందమైన చెట్లు, పుష్పాలు, పక్షులు, జంతువులు దేవుడు ప్రసాదించినవే. "ఆయన ఆకాశమునుండి మీకు వర్షమును, ఫలవంతములైన రుతువులను దయచేయుచు, ఆహారమునను గ్రహించుచు, ఉల్లాసముతో మీ హృదయములను నింపుచు, మేలు చేయుటచేత తన్ను గూర్చిన సాక్ష్యము లేకుండ చేయలేదని" పౌలు తెలిపాడు (అపొ. 14:15-17).

## అప్పుడు, ప్రభువునకు మనమేమి చెల్లింతము?

"ఆయన మనకు చేసిన ఉపకారములన్నిటికి, తిరిగి మనం ప్రభువునకు ఏమి చెల్లించుదామని" - అడిగేలా మన కృతజ్ఞత మనలను ప్రేరేపించాలి. ప్రభువు యొక్క దాతృత్వానికి మనమెలా ప్రత్యుత్తరమిస్తాం? దీన్ని ఊహించు: ఎవరో ఒకరు నాకు ఒక అందమైన యింటిని, క్రొత్త కారును, బ్యాంకులో చాల అధికమైన ధనాన్ని యిచ్చారను కుందాం. తరువాత ఒక రోజున, ఈ దాతృత్వం ప్రదర్శించిన వ్యక్తి, నా యింటిలో ఒక రాత్రి గడుపుతానని, తరువాత ఉదయం తనను విమానాశ్రయానికి తోడుకొని పోయి

అక్కడ దించమని నన్ను కోరాడు. "లేదు, నీవు నానుండి బహు ఎక్కువగా ఎదురు చూస్తున్నావ్. నా మీద నా భార్యమీద బహు ఎక్కువ భారం మోపుతున్నావు. నాకు సమయం లేదు. దానికితోడు విమానాశ్రయంలో కారు పార్కు చేసికొనడానికి నాకు చాల ఖర్చు అవుతుంది!" అని నేను బదులిచ్చాను. అలాటి నా జవాబు పూర్ణంగా నన్ను కృతజ్ఞత లేని వాడనుగా చేస్తుంది. దేవుడు యింతగా మనలను దీవించిన తరువాత ఆయనకు మనం అనుకూలంగా బదులివ్వకపోతే కృతజ్ఞత లేనివారికంటె ఇంకను హీనమైనవారము కామా?

## మన ప్రేమ

మన ప్రేమ ప్రభువునకు మనం సమర్పించాలి. ఈ పాఠానికైన లేఖన భాగం కీర్తన. 116లో ఉంది. ఆ కీర్తన ఈ మాటలతో ఆరంభమౌతుంది: "యెహోవా నా మొరను నా విన్నపములను ఆలకించియున్నాడు కాగా నేనాయనను ప్రేమించు చున్నాను" (1 వ.). క్రొత్త నిబంధన దీనిని యిలా తెలియజేస్తుంది: "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము" (1 యోహాను 4:19; KJV).

మన లిష్టులో ప్రేమ ఉంది, ఎందుకంటే అనుకూలమైన మన ప్రత్యుత్తరాన్ని ప్రేమ పుట్టిస్తుంది. భార్య భర్తలు ఒకరినొకరు ప్రేమించుకొన్నప్పుడు, "వివాహంలోని అనేక నియమాలు" తమంతట అవే జరిగిపోతూ ఉంటాయి. మనం దేవుని నిజంగా ప్రేమించి నట్టయితే, ఆయనను ఆనందింపజేయడానికి ఏదైనా చేస్తాం ప్రతిదీ చేస్తాం.

## మన కృతజ్ఞతాస్తుతి

దేవునికి మనము కృతజ్ఞతాస్తుతులు చెల్లింప బద్ధులమైయున్నాము. "యెహోవా నాకు చేసిన ఉపకారములన్నిటికి నేనాయనకేమి చెల్లించుదును?" అని కీర్తన రచయిత అన్న తరువాత (116:12), కొన్ని వచనాలకు యిలా బదులిస్తున్నాడు, "నేను నీకు కృతజ్ఞతార్పణ సమర్పించెదను, యెహోవా నామమున ప్రార్థన చేసెదను" (17 వ.). క్రొత్త నిబంధనలో పౌలు యిలా వ్రాశాడు: "మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట సమస్తమును గూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు ..." (ఎఫెసీ. 5:20).

కృతజ్ఞతాస్తుతులు చెల్లించడంలో మనం తరచుగా తప్పిపోతాం. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో, సైన్యాధిపతియైన జార్జి పేటన్ ఒక సైనికుని అమెరికా దేశపు మూడవ సైన్యంనుండి విశ్రాంతి శిబిరానికి పంపాడట. ఆ సైనికుడు సైన్యాధిపతికి కృతజ్ఞతలు తెలుపుతూ ఉత్తరం వ్రాశాడట. తాను సైన్యంలో 35 సంవత్సరాలున్నా, ఆ కాలమంతటిలో తాను పొందిన కృతజ్ఞతా ఉత్తరం అదే మొదటిదని జెనరల్ పేటన్ అన్నాడు. బెంజిమిన్ ఫ్రాంక్లిన్ యిలా అన్నాడు: "వ్యర్థమైన ప్రతి మాటకు మనం ఎలా లెక్క చెప్పాలో, వ్యర్థమైన ప్రతి నిశ్శబ్దానికి మనం అలాగే లెక్క చెప్పవలసియుంది."

**మన సమయం**

మన ప్రేమ, మన కృతజ్ఞతలను ఎలా వ్యక్తపరచగలం? మన పాఠాన్ని ఎంత ఆచరణ యోగ్యంగా చేయాలో అంత ఆచరణ యోగ్యంగా చేద్దాం. దేవునికి సమయాన్ని సమర్పించాలి. పౌలు యిలా తెలియజేశాడు: "దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫెసీ. 5:15, 16; ఒత్తి పలకడం నాది). "నా జీవితం ఎంత విరామం లేకుండా ఉందో నీకు తెలియదు; ప్రభువుకు సమర్పించే సమయం నాకు లేదు" అని ఒకరు ఆక్షేపణ తెలుపవచ్చు, రోజుకు ఒక గంట ఎక్కువగా నీవు పడకమీద ఉండాలి, లేకుంటే చస్తావు అని డాక్టరు చెప్పాడనుకుందాం. చదవడం ద్వారా నీ కండ్లను రోజుకు 30 మినిషాలు వ్యాయామం చేయించాలి, లేకపోతే నీవు గుడ్డివాడవైపోతావు అని డాక్టర్ అన్నాడనుకో. నీ బిడ్డకు రోజుకు ఒక గంటసేపు నీవు తన చదువులో సహాయం చేయకపోతే అతడు తప్పుతాడు అని ఉపాధ్యాయుడు నీకు చెప్పాడనుకో. సమయాన్ని ఎలాగో అనుకూలం చేసికోవా? నీకు సమయం కన్పిస్తుందా? అలా ప్రభువు కొరకు సమయాన్ని కనుగొందాం సమయాన్ని అనుకూలం చేసికొందాం.

**మన సామర్థ్యాలు**

ఆయన మనకు ప్రసాదించిన సామర్థ్యాలను దేవునికి సమర్పించుదాం. మనకందరికి దేవుడు ప్రసాదించిన తలాంతులు ఉన్నాయని, వాటిని ఆయన మహిమ కొరకు మనం వాడాలని మత్తయి 25:14-30లోని తలాంతుల ఉపమానం మనకు బోధిస్తుంది. ఆ ఉపమానంలో, ఒక తలాంతువాడు, తన తలాంతును పూడ్చి పెట్టాడు. స్వార్థము, నులివెచ్చనితనం, భౌతికవాదం, భక్తిహీనత, విముఖత అనే సమాధులలో మన తలాంతులను పూడ్చిపెట్టి దోషులము కాకుందుము గాక.

**మన డబ్బు**

మన ఆస్తులను కూడా మనమాయనకు సమర్పింప బద్ధులమైయున్నాం. అపొ. 2లో ఆది క్రైస్తవులు సంతోషించినట్టు వర్ణింపబడింది: "... ఆనందముతోను నిష్కపటమైన హృదయముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి" (అపొ. 2:46బి). "వారు తమ చర స్థిరాస్తులను అమ్మి, అందరికిని వారి వారి అక్కరకొలది" పంచి పెట్టడానికి వారు వెనుకాడ లేదు (45 వ.). 2 కొరింథీ. 8 ప్రకారం, మాసిదోనియాలోని క్రైస్తవులు, "నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్తరించెను" (2 వ.). దేవుని పని విస్తరించడంలో మన ఆస్తులను ఉపయోగించక పోయినట్లయితే, మన ప్రేమ లోతు లేనిదైయుంటుంది.

**మన సమస్తం**

ఇంకా ఎంతో చెప్పవలసియుంది. మన "సమస్తము" ప్రభువునకు సమర్పించ వలసినదిగా మన ప్రత్యుత్తరం ఉండాలని నన్ను సంగ్రహం చేయనిమ్ము (మత్తయి 22:37

చూడు). “యెహోవాకు నేనేమి చెల్లింతును?” అని ప్రశ్న అడిగిన తరువాత, “నేను నా మ్రొక్కుబళ్లు చెల్లింతు”నని రచయిత అంటున్నాడు (కీర్తన. 116:14ఎ; 18ఎ వ. కూడా చూడు). మరోవిధంగా చెప్పాలంటే, “నేను ప్రభువునకు వాగ్దానం చేసిన ప్రతిదాన్ని జరిగిస్తాను” అని అతడు అంటున్నాడు.

నీవు, నేను క్రైస్తవులమైనప్పుడు, యేసును ప్రభువుగా ఒప్పుకున్నాం (అపో. 8:36–38; రోమా 10:9, 10). ఆ ఒప్పుకోలులోను, దానివెంట జరిగిన బాప్తిస్మంలోను, మనం మన జీవితాలను ప్రభువునకు సమర్పించుకొంటున్నాం. నిరంతరం ఆయన యిష్టం నెరవేరుస్తామని వాస్తవంగా మనం మ్రొక్కుకుంటున్నాం.

## ముగింపు

ఫ్రాన్‌సెస్ హావెర్గల్ యిలా వ్రాశాడు,

> నా జీవితాన్ని తీసికో, అది నీకు
> సమర్పింపబడనీయండి ప్రభువా;
> ………………………………
>
> నా ప్రేమను గొనుమీ ప్రభువా, నేను ఒలికిస్తున్నాను
> నీ పాద సన్నిధి వద్ద దాని ధన నిధియందు;
> నన్ను గైకొను, మరియు నేను
> నీకు మాత్రమే ఎల్లప్పుడు నా సమస్తం.[4]

మనకొరకైన దేవుని ఉపకారములు అతి శ్రేష్ఠమైనవి, మనము మన శ్రేష్ఠమైనవి ఆయనకు సమర్పింతుము గాక![5]

---

సూచనలు

[1]నోవహు దినాల్లో ఓడలోని వారే బ్రతికారు, ఓడ వెలుపలివారు బ్రదుకలేదు. [2]వాగ్దాన భూమిలో దేవుడు ఆశ్రయపురాలను ఏర్పాటు చేశాడు. దానిలోనికి పారిపోయినవారు కాపాడబడేవారు (సంఖ్యా. 35). [3]దేవుడు జీవిత అవసరతలను అనుగ్రహించాడనే దానికి ద్వితీయో. 8:18; కీర్తనలు 37:25లను కూడా చూడు. [4]Frances R. Havergal, “Take My Life, and Let It Be,” *Songs of Faith and Praise*, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1996). [5]పాఠాన్ని సిద్ధపరచడంలో వెండెల్ విన్‌క్లెర్ – “What Shall I Render Unto the Lord for All His Benefits Toward Me?”లోనుండి ఎక్కువగా అప్పుతేబడ్డాయి. *Giving With a Purpose, a Promise, and a Performance* (Fort Worth, Tex.: Winkler Publications, 1966), 165-89.